# మా కెమేరా కహానీ

ఇంట్లో ఫోటోగ్రాఫరుంటే ఇంటికి దోషం అని నా సిద్ధాంతం. ఫొటోలు తీయించుకోవాలనే కోరిక కలిగినపుడు ఇంట్లో ఫొటోగ్రఫీ గురించి తెలిసినవారు వుండటం ఎప్పుడూ శ్రేయస్కరంకాదు. మీ ఇంట్లో ఒక చిన్న కెమేరాపెట్టి వుంటే ఇక మీ జన్మలో మీరు మంచి ఫొటో తీయించుకోలేరు.

మాటవరసకి మీ చూరుకింద ఒక బడ్డింగు రైటరు కాని, రైటరీమణికాని వున్నారనుకోండి. ఆ రైటరు రాసిందంతా మీరు ఓపిగ్గా వినవలసిందేకదా! ఆ రైటరు రాసినవీ తిరిగొచ్చినవీ కలిసి వినేసరికి నిజమైన సాహిత్యంమీద మీకు విరక్తి కలుగుతుందా, కలగదా? ఒకవేళ మీ మనసు దిగజారిపోతే మీ ఇంటిపక్క రచయితకి జైకొట్టే స్థాయికి మీరు పతనమవుతారు. ఫొటోగ్రఫీకాదు, రచనలే కాదు, ఏ కళైనా అంతే! కేరమ్సు ఆట బాగా రానివాళ్ళతో ఆడితే ఆట వారి స్థాయికి దిగిపోతుంది. చదరంగం అంతే-దీన్ని శాచ్యురేషన్ పాయింటు అని అంటారు కామోసు.

మీవారో హ్యాండ్ కెమేరా కొన్నారనుకోండి (పాపం శమించుగాక) ఆ కెమేరా నోటికి మీరు ఎరకావలసిందే - మిమ్మల్నెవరూ రక్షించలేరు. పోతే మీ చుట్టాల్లో ఒక ఫొటోగ్రాఫరుంటే మీకు మరింత ప్రమాదం. అతను సరిగ్గా తీయడు. మనం మరో చోటుకి వెళ్ళి తీయించుకొనటానికి వీలుండదు.

"వాడా వాడిబతుకు నన్నడగండి చెప్తాను" అని (కుటుంబరావుగారి కథలోలాగ) మీ కుటుంబ ఛాయా చిత్రకారుడు ఒక చింకి లెక్చరు దంచుతాడు. ఈ వూళ్ళో గొప్ప ఫొటోగ్రాఫరు వెనక నా దగ్గర ప్లేటు కడిగేవాడంటాడు. వాడి మొహం వాడికేం రాదు అనో, ఫొటోలు తీయించుకోడాని కొచ్చిన పల్లెటూరి ఆడాళ్ళను చాటుకు తీసికెళ్ళి ముద్దెట్టు కుంటాడనో ఏదో ఒక బ్లాక్ మెయిల్ ప్రారంభిస్తాడు. అదంతా మీరు వినక తప్పదు.




అసలు ఫొటోలు యెప్పుడు తీయించుకోవాలి. యెందుకు తీయించుకోవాలి అనే విషయంపై చాలా గొడవ వుంది. లోకం సంతోషించక పోయినా మనం పుట్టినందుకు మనమే ఆనందిస్తాము గనుక పుట్టినరోజుకి ఫొటో తీయించు కోవటం ఒక ఆచారం. స్కూళ్ళలో విడిపోయే ముందు మళ్ళీ కలుసుకోడానికి వీలుండదు గనుక అందరూ కలిసి ఒక ఫొటోలో తగలడితే మంచిదని తీయించుకునే గ్రూపు ఫొటోలు సాంవత్సరీకాల్లాటివి.

కొత్తచీర కొనుక్కున్నప్పుడల్లా ఫొటో తీయించు కోవాలని వుబ

లాటపడేది మా పిన్ని. ఫొటో ఖరీదు, చీర ఖరీదు కలిసి తడిసి మోపుడై పోతుందని గోలపెట్టేవాడు మా బాబాయి. పండగలకి అప్పుడప్పుడు ఫొటోలు తీయించుకోవాలని వుబలాట పడటం కద్దు, పెళ్ళి ఫొటోలని తీస్తారు, అందులో పురోహితుడి ముందు పెళ్ళికొడుకు కెప్పుడూ బిక్క బిక్కుమంటూ వుంటాడు. హ్యాండు కెమేరాతో తీసిన పెళ్ళిఫొటోలు అట్టే పవిత్రమైనవికావని, స్టూడియోకెళ్ళి ఫొటో తీయించుకోవటం ఉత్తమోత్తమమని మా వాళ్ళు చాలామంది అభిప్రాయ పడుతూ వుంటారు. పెళ్ళి ఫొటో తీయించుకోవటానికి వెళ్ళేటప్పుడు పొగరుమోతు జటకాలో ఎక్క వెళ్ళకండి. గుర్రం మంచి దవునా కాదా, సైడు కాలవల్లోకి, పక్క మైదానాల్లోకి యీడ్చేరకం అవునా కాదా కొంచెం చూసుకోవాలి. ఒకమారు పెళ్ళి ఫొటోకి వెళ్తున్న జట్కా తిరగబడింది. అందులో నేనూ వున్నాను పెళ్ళి కూతురికి చెలికత్తెలాగ, పెళ్ళికూతురిని జట్కావాడూ, పెళ్ళికూతురి తల్లిని పెళ్ళికొడుకూ రక్షించారు బండిలోంచి లాగి. పెళ్ళికొడుక్కి మూతి కొంచెం చిట్లింది. పెళ్ళికూతురు కెమేరా కేసి మెడ తిప్పలేక పోయింది. నేను కొంచెం టచ్ చేస్తాన్లెండి అన్నాడు ఫొటోగ్రాఫరు. ఈ సంగతెలిసి మా చిన్నమావయ్యగారు ఆగ్రహోదగ్రుడై జట్కావాడిని తన్నారు. ఆ నంబరు నోట్ చేసుకుని లైసెన్సుబిళ్ళ లాక్కోనందుకు పెళ్ళికొడుకుమీద కూడా చిరాకుపడ్డారు. వాళ్ళ వెనకాల ఎగురుకుంటూ వెళ్ళినందుకు కాలో చెయ్యో విరగలేదుకదా అని మా అమ్మ నా జాయింట్లవీ సరిగ్గా వున్నాయో లేదో పరీక్షచేసి కనకదుర్గమ్మ తల్లికి శుక్రవారం కొబ్బరికాయకొట్టి రవికల గుడ్డా పసుపూ కుంకుమా యిచ్చి వచ్చింది. ఒకసారి పెళ్ళిఫొటోకి వెళ్ళాం. పెళ్ళికొడుక్కి సూటు వేసుకోవాలనుంది. ఆమాట తను చెప్పలేక పోతున్నాడు. ఎందుకంటే వాళ్ళ నాన్నగారు కోపిష్టి. మధుపర్కాలు విప్పటానికి వీల్లేదని పేచీ పెడతాడు. ఆ అబ్బాయిని నవ్వమంటాడు ఫొటోగ్రాఫరు. అమ్మా నువ్వంతగా నవ్వకూడదు అంటున్నా పెళ్ళికూతురే నవ్వుతున్నది గాని పెళ్ళికొడుక్కు నవ్వు రావటంలేదు. అన్నయ్య సూటు వేసుకుంటానంటున్నాడు ఫొటోలో అంటూ కీచుమంటూ అరిచింది పెళ్ళికొడుకు

చెల్లెలు. టబ్ వీల్లేదు అని పెళ్ళికొడుకు తండ్రి శిఖండిలా అడ్డుతగిలాడు. అప్పుడు మధ్యవర్తి పరిష్కారం జరిగింది. నూటు చేత్తో పట్టుకుని పెళ్ళి కొడుకు ఫొటోలో దిగాడు. తరువాత దాన్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని ఫోటో అఘోరించమను మేం వద్దన్నామా అని పెళ్లికొడుకు తండ్రి పందిట్లో చిందులు తొక్కాడు. పెళ్లిఫొటోల గోడవల్ని గుర్తించి రాస్తే డిష్నరీ అంత పెద్ద గ్రంథం రాయవచ్చు, అదల్లావుణ్ణీండి.

పూవులు ముడిపించినప్పుడు, గాజులు వేయించినప్పుడు ఫోటోలు యథావిధిగా తీయిస్తారు. పూలజడ ఫొటోలని నిలువుటద్దం ముందు నిల బడి తీయించుకునే ఫోటోలు అవి అన్ని ఒకే స్టయిలులో వుంటాయి. శాల్తీలే మారుతుంటాయి. నెక్లెస్ చేయించు కున్నప్పుడు, పట్టుచీర కొత్తది కట్టుకున్నపుడు ఫోటోలు తీయించే ఆచారం కూడా వుంది.

మా అమ్మమ్మకు ఫొటోలు తీయించట మంటే చాలా కోపం, ఫొటోలుతీస్తే పిల్లలు జ్వరంవచ్చి చిక్కిపోతారంటుంది, ఆయుక్షీణం అని ఆవిడ ఫొటోలు తీయనివు. ధర్మామీటరింట్లో వుంటే జ్వరాలు వస్తాయని ధర్మామీటరు పగలగొట్టింది. ఫ్లాస్కో అన్నా ఆవిడకు అనుమానమే, పురి టాలుకు ఫ్లాస్కోలో నీళ్ళు, కాఫీ, పాలు, వుంచితే మంచిది కాదని దాన్ని కూడా విసిరి అవతల పారేసింది. మా తాతయ్యకు జబ్బులో కొడుకులు కొబ్బరిచెట్టుకింద కుర్చీలో కూర్చోపెట్టి ఫొటో తీయించారు. ఆ ఫోటో తీశాక మా తాతయ్య ఎక్కువ రోజులు బతకలేదుట, ఆవిడకు అదంటే వొళ్లమంట.

ఇంట్లో ఫొటోగ్రాఫరుంటే ఇంటికి దోషం అని చెప్పాను కదా - ఫిలిం ఖర్చేకాని బొమ్మదక్కే ఉపాయంలేదు. మా ఇంట్లో చాలా పిచ్చి ఫొటోలున్నాయి. అవన్నీ మా వారు చేత్తో తీసినవే. పండగొస్తుంది. అప్పుడు కెమేరా పైకి తీస్తారు. మేం వెళ్ళి బట్టలు కట్టుకుని వచ్చి నిలబడ

తాము. క్లిక్కు మనిపిస్తారు. ఫిలిం కడిగివచ్చేదాకా ఆశగా ఎదురుచూస్తాం. ఆ బొమ్మలు చూశాక ఏడుపాగదు, బావులేదంటే తీసిన వారికి కోపం. ఆ బొమ్మలు సరిగా వున్నాయని సరిపెట్టుకుందామంటే ఆ ఫొటోలోవున్నంత వికారంగా వున్నామా అని మనసులో దిగులు. ఎగదీస్తే గో హత్య దిగదీస్తే ఫొటోగ్రాఫర్ హత్య ఎందుకొచ్చిన గొడవ ? స్టూడియోకి పోదాం పదండి అంటే మావారు వినరు. ఆయనకు కెమేరా వైరాగ్యం వస్తే అప్పుడు కాని మాకు మోక్షంలేదు. ఫిలిం పోకడేలేని ఫొటో ప్రతికేది కనపడదు.